తండాలో సమస్యల తిష్ట

• మురికికూపంగా రామగిరి ఎగువ తండా • పట్టించుకోని పాలకులు, అధికారులు • ఆందోళనలో తండావాసులు

పామిడి: మండలంలోని రామగిరి ఎగువ తండా సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. తండాలో డ్రైనేజీ, నీటి సమస్య వంటి మౌలిక వసతులు మృగ్యమయ్యాయి. రామగిరి ఎంపీటీసీ పరిధిలోకి రామగిరి గ్రామంతో పాటు రామగిరి ఎగువ, దిగువ తండాలు, దిబ్బసానిపల్లి గ్రామాలు వస్తాయి. రామగిరి ఎంపీటీసీ స్థానానికి సంబంధించి మొత్తం 2,700 మంది జనాభా కాగా, 1700 మంది ఓటర్లు ఉన్నారు. మరీ ముఖ్యంగా కేవలం రామగిరి ఎగువ తండాకు సంబంధించి 750 మంది జనాభాలో 550 మంది ఓటర్లు ఉన్నారు. 160 గృహాలు ఉన్నాయి.

వేధిస్తున్న నీటి, డ్రైనేజీ సమస్య

తండాలో నీటి, డ్రైనేజీ సమస్య తాండవిస్తోంది. ఆర్‌డబ్ల్యూఎస్ పైప్‌లైన్ ట్యాంకుకు నోచుకోకపోవడంతో నీటి సమస్యతో సతమతమవుతున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలం అవ్వడంతో నీటి సమస్య తీవ్రమైందన్నారు. అలాగే గ్రామంలో డ్రైనేజీ కాలువ లేక మురుగు రోడ్లపై ప్రవహిస్తోందన్నారు. దీంతో మురుగునీటిని తొక్కుకుంటూ ఇళ్లలోకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అలాగే వీధులన్నీ దుర్వాసన వెదజల్లుతున్నాయి. దోమల బెడద అధికం కావడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

అధికారులు, సిబ్బంది విధులకు హాజరయ్యామా..వెళ్లామా అనే పరిస్థితి తప్ప విధి నిర్వహణలో జవాబుదారీతనం కొరవడింది. పారిశుధ్యంపై నిర్లక్ష్య ధోరణి బాగా పెరిగింది. మండలస్థాయి అధికారులు సైతం గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించడం లేదు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను ఆయా గ్రామాల్లో ఒక్కరోజు ఆర్భాటంగా నిర్వహించడం ఆ తర్వాత కార్యక్రమ ఉద్దేశాన్ని గాలికి వదిలేయడం పరిపాటిగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని తండావాసులు కోరుతున్నారు.



తండాలో అపరిశుభ్రంగా రహదారి



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

రోగాలు వెంటాడుతున్నాయి



“ గ్రామానికి మౌలిక వసతులు మృగ్యమైయ్యాయి. వేసవిలో నీటి సమస్య తీవ్రతరమైంది. డ్రైనేజీలు లేక మురుగుంతా రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో మురుగును తొక్కుకుంటూ ఇళ్లలోకి వెళ్లాల్సి వస్తోంది. దీంతో రోగాలు వెంటాడుతున్నాయి. సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

–ఆర్ మురళీనాయక్, రామగిరి ఎగువ తండా

సమస్యలపై పలుమార్లు విన్నవించా..



గ్రామాల్లోని సమస్యలపై పలుమార్లు అధికారుల దృష్టికి తెచ్చాను. ప్రతి మండల మీట్‌లోనూ గ్రామ సమస్యలపై ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తెస్తున్నా. అయినప్పటికీ అధికారులు ఇదిగో? అదిగో? అంటూనే కాలం వెళ్లదీస్తున్నారు. సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగిలి అక్కడే అన్న చందంగా మారింది.

–మజ్జిగ రాజశేఖర్, రామగిరి ఎంపీటీసీ సభ్యుడు

మౌలిక వసతుల కల్పనకు కృషి



గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాం. సుజల స్రవంతి పథకం కింద కత్రిమల పంప్‌హౌస్ నుంచి గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నాం. ఇక డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదిస్తాం. ఇకపోతే రామగిరి ఎగువ తండా గ్రామానికి ఆర్‌డబ్ల్యూఎస్ పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరాకు తీర్మానం చేశాం.

–కే తేజోత్స్న, ఎంపీడీఓ, పామిడి.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

శింగనమల/గార్లదిన్నె/యల్లనూరు/పామిడి: పదో తగరతి పరీక్షలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు సోషల్ పరీక్షకు శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 293 మందికి 292 మంది, కేజీబీవీలో 140 మందికి 139 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 150 మందికి 148 మంది హాజరైనట్లు ఎంఈఓ నరసింహరాజు తెలిపారు. శింగనమలలోని పరీక్ష కేంద్రాలను అనంతపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కేశవనాయుడు తనిఖీ చేశారు. విద్యార్థులకు సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన వెంట తహసీల్దార్ బ్రహ్మయ్య ఉన్నారు. ఎస్‌ఐ విజయకుమార్ బందోబస్తు నిర్వహించారు.

• గార్లదిన్నె మండల కేంద్రంతోపాటు కల్లూరులో పదో తరగతి పరీక్షకు 687 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 673 మంది హాజరయ్యారు.

• యల్లనూరు మండలంలోని చిలమకూరు మోడల్ స్కూల్లో మంగళవారం నిర్వహించిన పదో తరగతి పరీక్షలను డీఓ మహేశ్వర్‌రెడ్డి, చీఫ్ పంకజం మేరీ లీలా పరిశీలించారు.

• పామిడిలోని టీసీహెచ్‌లో 280 మందికి గాను 280 మంది పరీక్షలు రాశారు. అలాగే ఎస్‌ఎఫ్‌ఎస్‌లో 187 మంది విద్యార్థులకు గాను 185 మంది, ఎస్ఎస్‌వీఎంలో 199 మందికి గాను 195 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెగ్యులర్ కింద 100 మందికి గాను 99 మంది, ప్రైవేట్ కింద 10 మందికి గాను ఆరుగురు పదో తరగతి పరీక్షలు రాశారు. మొత్తం ఈ మూడు కేంద్రాల్లో 11 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలకు చీఫ్‌లుగా శ్రీనివాస్, హరినాథ్, మహాలక్ష్మి, విశ్వనాథ్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా వెంకటనాయుడు, శివప్రసాద్‌నాయుడు, రాఘవేంద్ర, మధుకర్ వ్యవహరించారు. పరీక్ష కేంద్రాల వద్ద సీఐ వీ యుగంధర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ బీఆర్ ప్రసాద్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



శింగనమలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కేశవనాయుడు

కార్మికులను రెగ్యులర్ చేయాలి

గుంతకల్లుటౌన్: ఆప్కాస్, ప్రైవేట్ ఏజెన్సీల విధానాలు రద్దు చేసి మున్సిపల్ ఉద్యోగ, కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి నరసయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. విధి నిర్వహణలో ఉన్న కార్మికులకు పనిముట్లు, తోపుడుబండ్లు, సబ్బులు, పాదరక్షలు, కొబ్బరినూనె, యూనిఫామ్ ఇవ్వాలన్నారు. రెగ్యులర్ కార్మికులకు సరండర్ లీవ్‌లు, ఇంక్రిమెంట్లు, పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నీ చెల్లించాలని, మరణించిన కార్మికుల కుటుంబసభ్యులకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని కమిషనర్ నయీమ్‌ను కలిసి వారు హెచ్చరించారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు జగదీష్, నాయకులు రంగనాయకులు, ఎర్రమ్మ, కృష్ణ, దాసు, సామెల్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

'రామాయణ'ను గుంతకల్లులో ఆపాలి

గుంతకల్లు: రామాయణ ఎక్స్‌ప్రెస్‌ను గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో హాల్ట్ (నిలుపుదల) సౌకర్యం కల్పించాలని బీజేపీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు వి.విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం న్యూఢిల్లీలోని రైల్వే బోర్డు మెంబర్ విజయ్‌ప్రతాప్‌సింగ్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఆమె తెలిపారు. దక్షిణాదిలోనే ప్రసిద్ధి చెందిన నెట్టికంటి ఆంజనేయస్వామి పుణ్యక్షేత్రాన్ని దృష్టిలో ఉంచుకుని అయోధ్య నుంచి రామేశ్వరం వరకూ నడుపుతున్న రామాయణ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్ట్‌లో దేవాలయాన్ని విలీనం చేయాలన్నారు. దీంతో దేశంలో ఉన్న భక్తులందరికీ నెట్టికంటుడి దర్శన భాగ్యం కలగడటంతోపాటు ఆలయం మరింత అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుందన్నారు. అలాగే గుంతకల్లు పట్టణాభివృద్ధికి అవరోధంగా మారిన గుంతకల్లు-గుత్తి రైలు మార్గంలోని కసాపురం రైల్వే మోరీ విస్తరణకు అనుమతులు మంజూరు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



రైల్వేబోర్డు మెంబర్ విజయ్‌ప్రతాప్‌కు వినతిపత్రం అందజేస్తున్న విజయలక్ష్మి

వైభవంగా బోనాల ఉత్సవం



యల్లనూరులో పెద్దమ్మ అమ్మవారు



కురుగానిపల్లిలో గంగమ్మ అమ్మవారు

నార్పల: మండలంలోని కురుగానిపల్లిలో బోనాల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం భక్తులు పెద్దఎత్తున పాల్గొని గంగమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. యువకులు సరదాగా కోడిపందేలు ఆడారు. అనంతరం పలు గ్రామీణ క్రీడాలు ఆడారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

యల్లనూరు: మండలంలోని కొడవండ్లపల్లి పెద్దమ్మ, చింతకాయమంద అంకాలమ్మ, యల్లనూరు పెద్దమ్మ అమ్మవార్లకు ఉగాదిని పురస్కరించుకొని ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేసి బోనాలను సమర్పించారు. ఆలయాల వద్ద భక్తులు అమ్మవారి సేవల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

నరసాపురంలో జ్యోతుల ఊరేగింపు

పెద్దపప్పూరు: ఉగాది సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున మండలంలోని నరసాపురంలో తొగట వీరక్షత్రియులు చౌడేశ్వరీదేవి అమ్మవారి జ్యోతుల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. సిబ్బందితో కలసి ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ బందోబస్తు నిర్వహించారు.



కురుగానిపల్లిలో బోనాలు మోసుకెళ్తున్న మహిళలు



నరసాపురంలో జ్యోతులను ఊరేగిస్తున్న నేత కార్మికులు

చికెన్, మటన్ ధరలకు రెక్కలు



గుత్తిలో మటన్ కొనుగోలు చేయడానికి బారులు తీరిన ప్రజలు



తాడిపత్రిలో పెరిగిన ధరలను సూచిస్తూ ఏర్పాటు చేసిన బోర్డు

గుత్తి/తాడిపత్రి రూరల్: ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో మంగళవారం చికెన్, మటన్ ధరలకు రెక్కలొచ్చాయి. గుత్తిలో మూడు రోజులు క్రితం కిలో చికెన్ రూ. 170, కిలో మటన్ రూ. 700 ధర ఉండేది. అయితే మంగళవారం చికెన్ కిలో రూ. 220 నుంచి రూ. 240, మటన్ రూ. 700 నుంచి రూ. 750కు పెంచారు. చికెన్, మటన్ విక్రయదారులు ఇష్టానుసారంగా ధరలు పెంచినా మున్సిపల్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. ధరలు పెంచడంతో మాంసం, చికెన్ ప్రియులు కొనుగోలు చేయడానికి ఇబ్బందులు పడ్డారు. అలాగే తాడిపత్రిలో స్కిన్‌తో కూడిన చికెన్ రూ.180, స్కిన్ లెస్ చికెన్ రూ.200 ధర ఉండేది. మంగళవారం స్కిన్‌తో కూడిన చికెన్‌రూ.240కి, స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.270కి పెరిగింది. పెరిగిన ధరలతో అటు ఫారం నిర్వాహకులు, వ్యాపారులకు ఉపశమనం లభిస్తుండగా ప్రజలకు భారంగా మారింది.

నేడు 'ప్రజా దర్బార్'

గార్లదిన్నె: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ప్రజాదర్బార్ కార్య క్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఈరమ్మ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ కార్యక్రమానికి శింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు శ్రావణి హాజరవుతారన్నారు.

3 నుంచి పాలిసెట్ ఉచిత కోచింగ్ ప్రారంభం

గుంతకల్లు రూరల్: పట్టణంలోని సరోజినీనాయుడు మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో ఈ నెల 3 నుంచి పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ కోసం ఉచిత కోచింగ్ సెంటర్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పీఎస్‌వీ రమణా రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంట్రెన్స్ పరీక్ష ఏప్రిల్ 30న నిర్వహించనున్న నేపథ్యంలో అభ్యర్థులు ఈనెల 15లోపు దరఖాస్తులను సమర్పించాలని ఆయన సూచించారు. గుంతకల్లు పట్టణంలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. మరిన్ని వివరాలకు 7075932669, 7416545162, 9441576517 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులకు ఉచిత కోచింగ్ మెటీరియల్ అందజేస్తామని ఆయన తెలిపారు.

బాట సుంకులమ్మ తిరునాల



అలంకరణలో సుంకులమ్మ అమ్మవారు

పుట్లూరు: మండలంలోని నాయకునిపల్లి వద్ద బాట సుంకులమ్మ తిరునాల మంగళవారం వైభవంగా జరిగింది. మండలవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. తిరునాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో తినుబండారాలు, ఆటవస్తువులు, గాజుల దుకాణాలు వెలిశాయి. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేపట్టారు. తిరునాల సందర్భంగా నిర్వహించిన రాతి దూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, జేసీ పవన్‌రెడ్డి ప్రారంభించారు. గెలుపొందిన వృషభాల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు.

సంక్షిప్త సమాచారం

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

తాడిపత్రి రూరల్: వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి నివారణతో పాటు కలుషిత నీటి నివారణ, కొత్త పైపు లైన్ల ఏర్పాటు, వాటర్ ట్యాంకుల క్లీనింగ్ తదితర అంశాలపై జరిగిన కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ శివరామక్రిష్ణ పాల్గొన్నారు. మునిసిపాలిటీ నీటి ఎద్దడి నివారణ కోసం తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్‌కు వివరించారు. పెన్నానదిలోని బోర్లతో పాటు, గండికోట ప్రాజెక్టు నుంచి సరఫరా అవుతున్న నీటి గురించి తెలిపారు. పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

7 నుంచి శిక్షణకు జడ్జి

తాడిపత్రి రూరల్: తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి క్రిష్ణవేణి ఈ నెల 7 నుంచి మే 3వ తేదీ వరకూ శిక్షణ కోసం జిల్లా కేంద్రానికి వెళ్లనున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు జడ్జి శిక్షణకు వెళ్తారని తాడిపత్రి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు మంగళవారం తెలిపారు.



జడ్జి క్రిష్ణవేణి

పింఛన్ల పంపిణీ పరిశీలన

గుంతకల్లుటౌన్/తాడిపత్రి రూరల్/పుట్లూరు/పామిడి: గుంతకల్లు పట్టణంలోని 10, 24 వార్డుల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ పరిశీలించారు. అంతకుముందు ఆయన 60 అడుగుల రోడ్డు, తిలక్‌నగర్‌లల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అలాగే తాడిపత్రి మునిసిపాలిటీలో మొత్తం 9571 పింఛన్లకు గానూ 9,310 పింఛన్లను పంపిణీ చేశామని కమిషనర్ శివరామక్రిష్ణ తెలిపారు. అదేవిధంగా పుట్లూరు మండలంలోని నాయకునిపల్లిలో ఎమ్మెల్యే బండారు శ్రావణి పింఛన్లు పంపిణీ చేశారు. పామిడి మండల వ్యాప్తంగా 7,404 మంద పింఛన్లకు గాను 7123 మందికి పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీఓ తేజోత్స్న తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

గుత్తి: పట్టణంలోని బీసీ కాలనీలో ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు ఆలయంలోకి ప్రవేశించి, హుండీని ధ్వంసం చేసి అందులో ఉన్న సుమారు రూ. 20 వేలు నగదు అపహరించారు. ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

క్లుప్తంగా

జాతర ప్రారంభం



జాతరకు హాజరైన నైరుతిరెడ్డి తదితరులు

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లి గ్రామంలో పెద్దమ్మ ఊరు జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామంలో పెద్దమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు, గుంతకల్లు మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి జాతరకు హాజరయ్యారు. వారికి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంగరాజుయాదవ్, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, హరికృష్ణ, బొలికొండి, కంబగిరి, కౌన్సిలర్ వరదరాజులు పాల్గొన్నారు.

6న సీతారామస్వామి కల్యాణోత్సవం



సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 6న సీతారామస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు శంకరయ్య, రవిశర్మ మంగళవారం తెలిపారు. శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి మూల విరాట్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేస్తామన్నారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవానికి భక్తులు హాజరుకావాలన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలి



హెచ్‌ఎంను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు అల్తాఫ్ సూచించారు. మండలంని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో జంతలూరు గ్రామంలో జాతీయ సేవా పథకం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-3 వారు ఏడు రోజుల ప్రత్యేక శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నగదు చెల్లింపుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు సమాజ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. అనంతరం అల్తాఫ్‌ను సన్మానించారు కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మిదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ అరవింద్ బాబు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణ, సీఎస్‌ఈ హెచ్‌ఓడీ వీర ప్రకాష్, మధుసూదన్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నీటి తొట్టె నిర్మాణానికి భూమిపూజ



పుట్లూరులో నీటి తొట్టె నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రావణి

పుట్లూరు/పామిడి: పుట్లూరు మండల కేంద్రం వడ్డెర కాలనీ సమీపంలో ఉపాధి హామీ పథకం కింద నీటి తొట్టె నిర్మాణం పనులను ఎమ్మెల్యే బండారు శ్రావణి ప్రారంభించారు. రూ.32వేల వ్యయంతో మూగజీవాల కోసం నీటి తొట్టెను నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అంజనేయులు, తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ అలివేలమ్మ, ఏపీఓ నరేంద్ర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పామిడి మండలంలోని కండ్లపల్లిలో మండల స్పెషలాఫీసర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీఓ కే తేజోత్స్న భూమి పూజ చేశారు. ఉపాధి పథకం కింద రూ.33 వేల నిధులతో తొట్టె నిర్మించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కూటమినేతలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

100 నీటి తొట్టెల మంజూరు

శింగనమల: మండలంలోని గ్రామాల్లో వేసవి దృష్ట్యా పశువుల కోసం 100 నీటి తొట్టెలు మంజూరైనట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. మంగళవారం శింగనమల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నీటి తొట్టె నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను పశువుల కోసం నీటి తొట్టెలు నిర్మిస్తామన్నారు. రైతులు వాటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

హంద్రీనీవా సామర్థ్యాన్ని పెంచాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేసి సమస్యలను వివరిస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లు/గుంతకల్లు రూరల్: హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి నీటి సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఎం నాయకులు మంగళవారం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీ.శ్రీనివాసులు మాట్లాడుతూ గుంతకల్లు మండలంలో హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు సాగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన విధంగా కాలువ సామర్థ్యం పది వేల క్యూసెక్కులకు పెంచేలా పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని ప్రజలు, రైతులు కోరుకుంటున్నారన్నారు. రాగులపాడు లిఫ్ట్ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా గుంతకల్లు నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీటిని అందించగలిగితే సాగు, తాగునీటి ఇబ్బందులు చాలా వరకూ తీరుతాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, కార్యదర్శి వర్గ సభ్యులు జగ్గిలి రమేష్, సురేంద్ర, నాయకులు చంద్రశేఖర్, రామునాయక్, ఈరన్న, డానియేల్, కిష్టప్ప పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని తాడిపత్రి రోడ్డులో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని ఇద్దరు గాయపడ్డారు. యాడికికి చెందిన శ్రీరాములు, శ్రీనివాసులు పని మీద బైక్‌లో గుత్తికి వచ్చి తిరిగి వెళ్తుండగా ఎదురుగా మరో బైక్ ఢీ కొంది. ఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆరుగురిపై కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో బుడుగ జంగం కాలనీకి చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కౌలుట్లయ్య తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ బుడుగ జంగం కాలనీలో జమ్మన్న, రామాంజనేయులు, జగన్ తమ ఇళ్లకు అమర్చుకున్న సీసీ కెమెరాలను అదే కాలనీకి చెందిన హుస్సేన్, కుపేంద్ర, సుంకమ్మ, దస్తగిరమ్మ, సాలమ్మ, సుంకమ్మ సోమవారం ధ్వంసం చేశారన్నారు. బాధితురాలు జయలక్ష్మి గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు.


ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. కల్లూరులోని బుడుగ జంగం కాలనీలో మంగళవారం ఉదయం ఆయన సీఐ కౌలుట్లయ్యతో కలసి పర్యటించారు. బుడుగ జంగం కాలనీలో ఇటీవల దేవర కార్యక్రమంలో భాగంగా ఓ ఇంటికి కట్టిన ఫ్లెక్సీ విషయంలో ఇరువర్గాల వారు దాడులు చేసుకున్నారన్నారు. దీంతో ఇరువర్గాల వారిపై గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. మంగళవారం మళ్లీ గ్రామంలో ఇళ్లపై దాడులు చేసుకుని సీసీ కెమెరాలు ధ్వంసం చేయడంతో డీఎస్పీ గ్రామంలో పర్యటించి ఇరువర్గాల ప్రజలతో మాట్లాడారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మంగళవారం సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులతో కలసి మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్‌లు, మున్సిపల్ మేనేజర్ రాంబాబు, ఆర్‌ఓ సతీష్ కమలాకర్, ఆర్‌ఐ షెక్షావలి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాతి దూలం లాగుడు పోటీలు



రాతిదూలం లాగుతున్న ఎద్దులు

గుంతకల్లు రూరల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని గుండాల తండాలో రాతి దూలం లాగుడు పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన ఎనిమిది జతల ఎద్దులు పోటీల్లో పాల్గొనగా వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీటీసీ శీలమ్మ కుమారుడు రమేష్ నాయక్ ఎద్దులు మొదటి స్థానంలో నిలిచాయి. వాలునాయక్‌కు చెందిన ఎద్దులు రెండవ స్థానంలో, మూడావత్ రమేష్ నాయక్ ఎద్దులు మూడో స్థానంలో లిచాయి. గెలుపొందిన వృషభాల యజమానులకు రూ.8,016, రూ.5,016, రూ.3,016 నగదు బహుమతులను అందజేశారు.

గుత్తి కోట అభివృద్ధిని ప్రభుత్వాలు విస్మరించాయి

గుత్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుత్తి కోట అభివృద్ధిని పూర్తిగా విస్మరించాయని గుత్తి కోట సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. గుత్తి కొండ వద్ద ఆయన మంగళవారం మాట్లాడారు. 2000 సంవత్సరాల చరిత్ర కలిగిన గుత్తి కోట అభివృద్ధిని విస్మరించడం విడ్డూరంగా ఉందన్నారు. గుత్తి కోటలో కనీస సదుపాయలు లేవన్నారు. కోట అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కోటను అభివృద్ధి చేస్తే పర్యాటక కేంద్రంగా మారి ఆదాయం సమకూరుతుందన్నారు. గుత్తి కోట సంరక్షణ సమితి ఉపాధ్యక్షులు కాశీరావు, గౌరవ సలహాదారులు గురు శంకర్, సభ్యులు జ్ఞానేశ్వర్‌రెడ్డి, సీతారాం తదితరులు పాల్గొన్నారు.